

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

(గత సంచిక తరువాయి)

### ఏది గొప్ప బహుమతి?

లోభి అంటే ఎవరు? ఇటీవలి కాలంలో 'లోభం' గురించి ఒక మంచి కొటేషన్ చదవటం తటస్థించింది. "ఈ ప్రపంచంలో అందరికన్నా గొప్ప లోభి. దొరికిన ప్రతి స్నేహాన్నీ, ఇతరుల పట్ల కృతజ్ఞతా భావాన్నీ జీవితాంతం మనసులో భద్రంగా దాచుకునేవాడు." చాలా గొప్ప సుభాషితం కదూ!

మనం ఎంత లోభులమైనా కనీసం మనకి నష్టంలేనివైనా కొన్ని ఇవ్వగలం.

ఈ ప్రపంచంలో మనం అన్నిటికన్నా గొప్పగా ఇవ్వగలిగే మంచి బహుమతి ఏమిటో తెలుసా? "ప్రోత్సాహం". ఎంత విలువగల బహుమతైనా ప్రోత్సాహానికి మించిన బహుమతి లేదు. ఒక వ్యక్తి జీవితంలో పైకి రావాలంటే తనలోని తెలియని శక్తిని ఆ వ్యక్తి గుర్తించగలిగి ఉండాలి. అలా గుర్తింపచేసేదే ప్రోత్సాహం. ప్రతి మనిషిలోనూ ఒక మేధావి ఉంటాడు. ఆ మేధావిని నిద్రలేపగలగడం కన్నా గొప్ప బహుమతి ఏముంటుంది? మనందరం జ్ఞానాన్నిచ్చే దీపాలం కాకపోవచ్చు. కానీ జ్ఞానాన్నివ్వగలిగే పుస్తకాన్ని బహుమతి ఇవ్వగలం కదా! ఈ పుస్తకపు ముందు మాటలో వ్రాసింది అదే

ఇది మనం ఒక వ్యక్తికిచ్చే బహుమతే కాదు. మొత్తం ప్రపంచానికి ఇచ్చే బహుమతి. ప్రతి వ్యక్తి తనలోని శక్తివంతుణ్ణి నిద్రలేపితే ప్రపంచం మొత్తం విలువైనది అవుతుంది కదా!

నీకు గెలవాలని ఉంటే, గెలిచినవాడి దగ్గర అసిస్టెంట్‌గా చేరు. ఆ గెలిచిన వాడిని గమనించు. ఎలా గెలుస్తున్నాడో పరిశీలించు. గెలవటాన్ని ఎలా అలవాటు చేసుకున్నాడో పరిశీలించు. ఆ విధానాన్ని నీ మనస్తత్వానికి, జీవితానికి అన్వయించుకో. చిన్న చిన్న మార్పులు చెయ్యి. గెలుపు నీదవుతుంది.

సినిమా ఫీల్డ్‌లో అతి చిన్న ఉద్యోగాల్లో ప్రవేశించి లక్షలు, కోట్లు సంపాదించిన నిర్మాతలు అందరూ పై సిద్ధాంతం ప్రకారమే తమ జీవితాన్ని నిర్దేశించుకున్నారు. బట్టలు కుట్టే దర్జీగా వృత్తిని ప్రారంభించిన వారు, భోజనాలు సప్లై చేసే వ్యక్తిగా చేరి నిర్మాతలైనవారు సినిమా పరిశ్రమకు కొత్తకాదు. కావలసిందల్లా కృషి. దానిక్కావల్సింది ప్రోత్సాహం.

అయితే నీ వారిని నువ్వు ప్రోత్సహించినట్టే ఒక్కోసారి వారిని విమర్శించవలసి వస్తుంది. కానీ విమర్శించే ముందు ఈ క్రింది విషయాలు గుర్తుపెట్టుకోవాలి.

1. విమర్శ అవసరమా?

2. అవతలి వ్యక్తి స్వీకరించగలడా?

3. ఇది సరి అయిన సమయమా?

ఈ మూడూ ఆలోచించి, విమర్శించు. అయితే,'ఖండన' వేరు. 'విమర్శ'వేరు. అదే విధంగా 'ప్రోత్సాహం' వేరు. 'పొగడ్త' వేరు.

***ఎవరు బిచ్చగాడు కాదు?***

జాన్ గ్రే అనే మానసిక శాస్త్రవేత్త ఒక అనుభవం గురించి రాసాడు. ఆ అనుభవంలో ఏ గొప్ప విశేషమూ లేకపోయినా చాలాకాలంగా గుర్తుండిపోయింది. 'లోభము' అన్న ఈ ప్రకరణంలో దాన్ని మీముందుంచడానికి ప్రయత్నం చేస్తాను. జాన్‌గ్రే ఈ విధంగా రాస్తాడు.

"ఒకరోజు నేను కారు తుడుస్తూ ఉండగా పక్కనే ఒక భిక్షగాడు నిలబడి ఉన్నాడు. మాసికలు వేసిన కోటు, చిరిగిన పాంటుతో అతడు నావైపే సూటిగా చూస్తూ నా చర్యల్ని గమనిస్తున్నాడు. అతడేమైనా అడుగుతాడేమోనని నేను అతడిని గమనించనట్టే నా పనిలో నిమగ్నమయ్యాను. అతడు కూడా చాలా సేపు ఏమీ మాట్లాడలేదు. కారు తుడవడం పూర్తయింది. లోనికి వెళ్ళిపోదామనుకున్నాను. అతడు కారునే చూస్తూ 'చాలా అందమైన కారు' అన్నాడు. నన్నేదో అడగబోతున్నాడని తెలిసిపోయింది. సమయం వృధా చేయడం ఇష్టంలేక "ఏమైనా సాయం కావాలా?" అనడిగాను.

అప్పుడు అతను చెప్పిన రెండు మాటలూ నాకు ఆ తర్వాత జీవితాంతం గుర్తుండిపోయాయి. అతడు చాలా సింపుల్‌గా "ఎవరికి వద్దు?" అన్నాడు.

అతడికి కొంత డబ్బు ఇచ్చి పంపించేసాను. కానీ ఆ రాత్రంతా ఆ రెండు మాటల గురించే ఆలోచిస్తూ ఉన్నాను. నేను మరో కారు కోసం అప్పుడు ప్రయత్నిస్తున్నాను. అదే విధంగా నా పిల్లవాడి సీటు కోసం పెద్ద యూనివర్సిటీలో పలుకుబడి ఉపయోగిస్తున్నాను.

***ఎవరికి వద్దు?***

ఫుట్ పాత్ మీద పడుకునేవాడు, హంసతూలికా తల్పం మీద శయనించేవాడు - అందరికీ కావాలి. నీకెంత ఉంది అనికాదు. నీకన్నా కింద వాళ్ళకి సాయం చేయడం మొదలు పెడితే 'ఎవరికి వద్దు?' అన్న ప్రశ్న ఎక్కువ వినపడ్డం తగ్గిపోతుంది. నువ్వెంత చిన్నవాడివైనా సరే, నీకన్నా చిన్నవాడు మరొకడుంటాడు.

నేను అప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటాను. భగవంతుడు ఒక దేవతను పిలిచి, నన్ను చూపించి "క్రింద ఆ కారు తుడుస్తున్న వ్యక్తి దగ్గరకు బిచ్చగాడి రూపంలో వెళ్ళు. అతడికి మరొక కారు, కుర్రవాడికి కాలేజీలో సీటు కావాలనుకుంటాను" అని పంపించాడేమో అనిపిస్తూ ఉంటుంది.

అప్పట్నుంచీ నేను 'ఏమైనా కావాలా?' అని అడగడం మానేసి వీలైనంత ఇవ్వడం ప్రారంభించాను.

(Taken From JOHN GREY)

***నలుగురు భార్యలు***

ఒక జపనీస్ పురాతన కథ మనిషి యొక్క మూడు దశల తాపత్రయం గురించి చెపుతుంది.

మొదటి దశ ఆస్తులు సంపాదించటానికీ, రెండో దశ స్నేహితులూ, అలవాట్లకీ, మూడో దశ శుష్కిస్తున్న శరీరాన్ని పోషించటానికి ప్రేరేపిస్తాయట.

ఒక వ్యక్తికి నలుగురు భార్యలు. పెద్ద భార్యని అతడెప్పుడూ నిర్లక్ష్యం చేసేవాడు. పట్టించుకునేవాడు కాదు. బాగా ఏడిపించేవాడు. కోప్పడేవాడు. రకరకాల భయాలు, దిగుళ్ళు, బాధల్తో హింసించేవాడు.

రెండో భార్య తెలివైనది. జీవితమంటే ఆనందించటానికే అని ఆమె ఉద్దేశ్యం. అతడితో బాగా ఖర్చు పెట్టించేది.

మూడో భార్యని అతడు ఎంతో కష్టపడి సంపాదించుకున్నాడు. ఆమె మిలమిలా మెరిసిపోయేది. అందం కోల్పోతుందేమోనని ఆమెని అనుభవించేవాడు కాదు. స్నేహితుల ముందు ప్రదర్శించేవాడు. కానీ మనసులో ఒక మూల, వారు ఆమెని స్వంతం చేసుకుంటారేమో, భార్యని కోల్పోతానేమో అన్న భయంతో నిద్ర సరిగ్గా పట్టేది కాదు.

యవ్వన కాలంలో పరిచయమైన స్నేహితురాల్ని తన నాలుగో భార్యగా చేసుకున్నాడు అప్పట్లో వున్న అందం, బిగి, ఇప్పట్లో ఆమెకు లేదు. అయినా పాత మమకారం వదల్లేదు. ఆ అందాన్ని ప్రతిష్ఠాపించటానికి ఎన్నో తైలాలూ, సుగంధద్రవ్యాలూ కొన్నాడు. ఎంతో ప్రేమగా చూసుకున్నాడు.

చివరికి అతడికి అంత్యకాలం సమీపించింది. తనతోపాటూ పైకి రమ్మని నలుగురు భార్యల్నీ అడిగాడు. మూడోభార్య, నాలుగో భార్య 'మేము రాము' అన్నారు. రెండో భార్య శ్మశానం వరకూ మాత్రం వస్తానంది. మొదటి భార్య మాత్రం అతడితోనే ప్రయాణం సాగించింది. ఆమెని అంతకాలం సరిగ్గా చూసుకోనందుకు అతడు చాలా విచారిస్తూ మరణించాడు.

***ఆ మొదటి భార్య ఎవరో తెలుసా?***

అతడి ఆత్మ.

అందుకే, మనిషి ఆ మొదటి భార్యని సరిగ్గా చూసుకోవాలి.

రోజూ బ్రష్ చేసుకోవటానికి అయిదు నిముషాలు, స్నానం చేయటానికి పది నిముషాలు కేటాయించే మనిషి, ఆత్మని శుద్ధి చేసుకోవటానికి నిముషం కూడా కేటాయించడు. తనని తాను తెలుసుకోవటానికి ప్రయత్నించకుండా 'వ్యసనం' అనే రెండో భార్యకీ, 'ధనం' అనే మూడో భార్యకీ, 'శరీరమ'నే నాలుగో భార్యకీ ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాడు.

***డబ్బు – ఆనందం***

డబ్బు వల్ల ఆనందం పెరుగుతుంది సరే. అయితే ఇక్కడ ముఖ్యాతి ముఖ్యమైన విషయం ఒకటున్నది. ఒకసారి నిత్యావసరాలు తీరుతూ వచ్చాక డబ్బువల్ల వచ్చే 'ఆనందం' తాలూకు విలువ తగ్గుతూ వస్తుంది. ఎంత మంచి పాయింటో చూడండి. ఒక వ్యక్తి నాలుగో కారు కొంటున్నప్పుడు వెయ్యిరెట్లు ఎక్కువ సంతోషిస్తాడు. మరోలా చెప్పాలంటే, మొదటి వెయ్యి రూపాయిలూ ఇచ్చిన ఆనందం, పదిహేనో లక్ష ఇవ్వదు. అయినా కొందరు వ్యక్తులు కోట్లు సంపాదించాక కూడా ఇంకా దాని యావలోనే బ్రతుకుతూ మిగతా సంతోషాల్ని దూరం చేసుకుంటారు.

లక్షలకొద్దీ దానధర్మాలు చెయ్యనవసరంలేదు. లక్షాధికారి అయ్యాక కూడా, ఆటో డ్రైవర్ దగ్గర అరవైపైసల కోసం అరగంట ఆగక్కర్లేదు. హోటల్‌లో వెయిటర్ యువకుడికి ఇచ్చే కాస్త 'టిప్పు' అతడిని ఎంతో సంతోషంలో ముంచుతుంది. అతడికో ముసలి తల్లి

వుండవచ్చు. లేదా అతడు ప్రైవేటుగా చదువుకుంటున్న విద్యార్థి అయ్యుండవచ్చు. కష్టపడే వాడికిచ్చే దానం, భగవంతుడికిచ్చే దక్షిణకన్నా ఎక్కువ పుణ్యాన్నిస్తుంది.

***విజయ రహస్యం***

రాక్ ఫెల్లర్ తన జీవితంలో గెలుపుకి చెప్పే కారణం చాలా గమ్మత్తయింది. దేశంలోని మొత్తం ఆయిల్ పరిశ్రమ అంతా అతడిదే 1911లో అతడి ప్రత్యర్థులు ప్రభుత్వాన్ని వత్తిడి చేసి, అతడి కంపెనీని చిన్నచిన్న ముక్కలుగా విడగొట్టి ప్రజలకి పంచాలనుకున్నారు. ఆయిల్ పరిశ్రమపై తన ఆధిపత్యం (మోనోపాలీ) పోతోందని తెలిసిన రోజు, రాక్ ఫెల్లర్ గోల్ఫ్ ఆడుకుంటున్నాడు.

అతడి 'స్టాండర్డ్ ఆయిల్ ట్రస్ట్'ని విడగొట్టి ప్రజలని అందులో షేర్ హోల్డర్స్‌గా చెయ్యాలని సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఇచ్చినప్పుడు ప్రభుత్వంలోని అతడి ప్రత్యర్థులు పండగ చేసుకున్నారు. అదే సమయానికి రాక్‌ఫెల్లర్ తన దీవిలో పెళ్ళాం పిల్లల్తో వున్నాడు. కేసు ఓడిపోయామని లాయర్లు ఫోన్ చేస్తే 'ఆనందంగా వున్న తనని డిస్టర్బ్ చెయ్యవద్ద'ని కోరుకున్నాడు.

కొద్ది సంవత్సరాలు గడిచేసరికి, విడగొట్టబడిన దాదాపు అన్ని కంపెనీలకీ తిరిగి అతడే అధిపతి అయ్యాడు. ప్రజల ఆర్థిక సపోర్టు కూడా లభించేసరికి అతడి నికర ఆస్తి ఆ కొద్ది సంవత్సరాల్లోనే మూడు రెట్లు పెరిగింది. ప్రపంచపు మొట్టమొదటి బిలియనీరు (వందకోట్ల డాలర్లు) అతడే అయ్యాడు.

గెలుపుకి కారణం విశ్లేషించమని విలేకర్లు అడిగితే, తన పిల్లల్తో ఆడుకుంటూ అతడేం చెప్తాడో తెలుసా? "కేవలం గమ్యాన్ని గుర్తుంచుకుని, కష్టాల్ని మర్చిపోవటమే నా విజయరహస్యం."

***మనలోని – ది బెస్ట్***

ఒక కాంట్రాక్టర్ దగ్గర ఎన్నో ఏళ్ళుగా ఒక వడ్రంగి మేస్త్రి పనిచేసేవాడు. వృద్ధాప్యం వచ్చేసరికి అతడు రిటైరవుదామని అనుకున్నాడు. ఆ విషయం కాంట్రాక్టరుతో చెబితే "ఒక చివరి ఇల్లు నిర్మించి ఆ తర్వాత రిటైరవ్వు" అని ఆఖరి కోరికగా కోరాడు.

అతడు "సరే" అన్నాడు. కానీ ఏ మాత్రం ఉత్సాహం లేదు. ఏదో చెయ్యాలి కాబట్టి పూర్తి చేసాడు.

అప్పుడా కాంట్రాక్టర్ వడ్రంగితో "నమ్మకంగా నా దగ్గర ఇంతకాలం పనిచేసినందుకు నీకోసమే ఆ ఇల్లు కట్టాను. నా బహుమతిగా తీసుకో" అన్నాడు.

వడ్రంగి షాకయ్యాడు. "ఈ విషయం ముందే తెలిసుంటే నా ఇంటిని మరింత శ్రద్ధతో నిర్మించేవాడిని కదా" అని మనసులోనే వాపోయాడు.

మనం కూడా మనలోని "ది బెస్ట్"ని సరిగ్గా ఉపయోగించుకోకుండానే మన జీవిత నిర్మాణాన్ని సాగిస్తాం. అది పూర్తవుతున్న దశలో మళ్ళీ ఆ పనిని మొదటి నుంచి చేస్తే బావుణ్ణు అని బాధపడతాం. జీవితం ఒక ప్రాజెక్ట్‌లాంటిది. ప్లాన్ చేసిన దగ్గర్నుంచి, నిర్మాణం పూర్తయ్యేవరకూ ప్రతీ పనిని శ్రద్ధగ చేస్తే జీవితం అనే ఇల్లు చక్కగా తయారవుతుంది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments